## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఉల్లింగిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మల్కాపట్నంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ మచిలీపట్నం డివిజన్ ఈఈ ఎం.భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మల్కాపట్నం, జగన్నాథపురం, రైలుపేట, బుట్టాయిపేట, అరవగూడెం, రాబర్ట్‌సన్‌పేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

### ప్రారంభానికి సిద్ధంగా గోదాము



కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డలో సుమారు రూ. 40 లక్షల వ్యయ అంచనాతో నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాము(ఎంపీఎఫ్‌సీ) ప్రారంభానికి సిద్ధంగా ఉంది. కొక్కిలిగడ్డ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యాన 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాముకు ఇటీవల ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శంకుస్థాపన చేశారు. అనంతరం శరవేగంగా నిర్మాణం పూర్తి చేశారు. రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులకు ఉపయోగపడుతుందని గ్రామస్తులు తెలిపారు.

### 'చవితి'కి సిద్ధమవుతున్న గణనాథులు



మోపిదేవి: వినాయక చవితి ఉత్సవాలకు గణనాథుల విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. మోపిదేవి తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని జాతీయ రహదారి పక్కన రాజస్తాన్ కళాకారులు గణపతి విగ్రహాలు తయారు చేస్తున్నారు. కొన్ని నెలలుగా 20 మంది ఆకర్షణీయంగా గణపతి విగ్రహాలను తీర్చిదిద్దారు. మూడు అడుగుల నుంచి 12 అడుగులు దాటిన గణపతి విగ్రహాలను ఈ ఏడాది ప్రత్యేకంగా తయారు చేసినట్లు నిర్వాహకుడు డోలారామ్ తెలిపారు. ఇప్పటికే కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన భక్తులు విగ్రహాల కోసం ఆర్డర్లు ఇచ్చినట్లు వివరించారు.

### విద్యుత్ కనెక్షన్లకు ఆధార్ నవీకరణ

చల్లపల్లి: విద్యుత్ వినియోగదారులు తమ కనెక్షన్లకు ఉన్న ఆధార్ నంబర్లను నవీకరణ చేసుకునే అవకాశం కల్పించినట్లు విద్యుత్ శాఖ ఏఈఈ అరవింద్ కుమార్ తెలిపారు. విద్యుత్ కనెక్షన్ ఎవరి పేరుతో ఉందో వారి ఆధార్ కార్డు నంబరు అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. కనెక్షన్ పొందిన వ్యక్తి మృతి చెందితే, సదరు మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించి, వారి కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు నంబర్లు అప్‌డేట్ చేయించుకోవాలని తెలిపారు. గ్రామ సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్లు, సబ్‌స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్లు ఈ సేవలను అందిస్తారని తెలిపారు.

### 300 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేత



చల్లపల్లి: రావెళ్ల కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని అవనిగడ్డ ఆర్టీసీ డిపో మేనేజర్ కె.హనుమంతరావు అన్నారు. స్థానిక ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్లోని 300 మంది విద్యార్థులకు మంగళాపురం ప్రముఖుడు రావెళ్ల కృష్ణ జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఉదయ్, ప్రవీణ్ రూ.18 వేలు వ్యయంతో ఉచితంగా బస్‌పాస్‌లు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రావెళ్ల సుజాత, హైస్కూల్ ప్రిన్సిపాల్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

### అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాలు అందజేత

అవనిగడ్డ: స్థానిక ప్రధాన రహదారి పక్కన అగ్నిప్రమాదానికి గురై కట్టుబట్టలతో మిగిలిన కేశాన దానయ్య, సూరగం నాగమల్లి కుటుంబాలకు పలువురు సాయం చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 14 రకాల వంట పాత్రల బాక్సులను తహసీల్దార్ రామకృష్ణ అందజేశారు. చైల్డ్‌హుడ్ గ్రూపు మిత్రబృందం ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు 25కిలోల బియ్యం నిత్యావసర వస్తువులు అందించారు. కార్యక్రమంలో చైల్డ్‌హుడ్ గ్రూపు మిత్రబృందం ప్రతినిధులు లీలాకృష్ణ, అన్నపరెడ్డి కృష్ణ, శ్రీనివాసరావు, శోభన్‌బాబు పాల్గొన్నారు.

### బాబా మందిర వార్షికోత్సవం

పమిడిముక్కల: వీరంకిలాకులోని శ్రీ సంతాన సాయిబాబా మందిర 27వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.

# ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

- మంత్రి జోగి రమేష్
- చినగొల్లపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం
- మేలు జరిగితేనే ఆశీర్వదించండి



చినగొల్లపాలెంలో వృద్ధులకు భరోసా ఇస్తున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. చినగొల్లపాలెం సచివాలయం -2 పరిధిలో సోమవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మంత్రికి మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఆయన ప్రతి ఇంటిని సందర్శించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వారి కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ, వారి అవసరాలను, సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే సంబంధిత అధికారులకు చెప్పి సమస్య పరిష్కారానికి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న తపోధనుడు సీఎం అని కొనియాడారు. ప్రజలు ఆర్థికంగా బలోపేతం కావడానికి జగనన్న కోట్లాది రూపాయలను సంక్షేమం రూపంలో అందిస్తున్నారన్నారు. ఇది చూసి ఓర్వలేని ప్రతి పక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు.

**మరింత అభివృద్ధి**

చినగొల్లపాలెం గ్రామానికి కొత్తకాలువపై ఒకటి, కాశీపట్నం వైపు మరొకటి రెండు వంతెనలు నిర్మించుకుని గ్రామానికి పూర్తిస్థాయిలో రవాణా సదుపాయం కల్పించిన ఘనత మనదే అని చెప్పారు. గ్రామంలో రహదారి, తాగునీటి సమస్యను తీర్చాలని మహిళలు మంత్రిని కోరగా త్వరలో వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాత్రి పొద్దుపోయే వరకూ గడప గడపకు కార్యక్రమం సాగింది. దీంతో ఆయన అదే గ్రామంలో నిద్రకు ఉపక్రమించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నకుమారి, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, కాపు, స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల డైరెక్టర్లు పి. మహేష్, భూపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి**



బొర్రపోతుపాలెంలో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు తెలిపారు. బొర్రపోతు పాలెంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం జరిగింది. పేర్ని కిట్టు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కలిగించారు. అర్హులకు పథకాలు అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నాడు. పెన్షన్‌లు సక్రమంగా అందిస్తున్నదీ లేనిదీ ఆరా తీశాడు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ.. పేదల ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో బుద్దాలపాలెం సర్పంచ్ దండిబోయిన బాబురావు, చిట్టిపాలెం ఇన్‌చార్జ్ చండిక అజయ్, మాజీ సర్పంచ్‌లు నట్టే ప్రసాద్, నట్టే గాయత్రీదేవి, రామాంజనేయులు, గోపిశెట్టి నాగకుమార్, తమ్మన ఏలియా తదితరులు పాల్గొన్నారు.

## నగర మేయర్‌గా చిటికిన వెంకటేశ్వరమ్మ

**4న ప్రమాణస్వీకారం**



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్‌గా 43వ డివిజన్ కార్పొరేటర్ చిటికిన వెంకటేశ్వరమ్మ సెప్టెంబరు 4వ తేదీన బాధ్యతలు స్వీకరించనున్నారు. మేయర్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. 4వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు మునిసిపల్ కార్యాలయంలో ఆమె మేయర్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నారు. మేయర్ పదవిని మోకా వెంకటేశ్వరమ్మ, చిటికిన వెంకటేశ్వరమ్మకు చెరో రెండున్నర సంవత్సరాలు ఇవ్వడానికి ఎన్నికల సమయంలోనే నిర్ణయించారు. దీనిలో భాగంగా మొదట మేయర్‌గా మోకా వెంకటేశ్వరమ్మ బాధ్యతలు స్వీకరించి ఇటీవల ఆ పదవికి రాజీనామా చేయగా మేయర్ స్థానానికి సెప్టెంబరు 4వ తేదీ ఎన్నిక నిర్వహించి ఎన్నికైన అభ్యర్థితో జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్ ప్రమాణస్వీకారం చేయించనున్నారు. అయితే మేయర్‌గా చిటికిన వెంకటేశ్వరమ్మ పేరును ఎమ్మెల్యే పేర్ని నాని ఇప్పటికే ప్రకటించారు. ప్రస్తుత కౌన్సిల్‌లో వైఎస్సార్ సీపీకి 44 మంది కార్పొరేటర్లు, టీడీపీకి ఐదుగురు, జనసేన ఒకరు కార్పొరేటర్లు ఉన్నారు. నలుగురు వైఎస్సార్ సీపీ కో-ఆప్షన్ సభ్యులు ఉన్నారు. దీంతో మేయర్ ఎన్నిక వైఎస్సార్ సీపీ అభ్యర్థి అయిన చిటికిన వెంకటేశ్వరమ్మ ఎన్నిక లాంఛనం కానుంది. గౌడ సామాజిక వర్గానికి చెందిన చిటికిన వెంకటేశ్వరమ్మ బాధ్యతలు స్వీకరించనున్నారు. తన పేరు ఖరారు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పేర్ని నానికి వెంకటేశ్వరమ్మ సోమవారం కృతజ్ఞతలు తెలిపారు.

## కచ్చితమైన ఓటర్ల జాబితాకు చర్యలు

**ఆర్డీవో కిషోర్**



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో కిషోర్

చిలకలపూడి(మచిలీపట్నం): డివిజన్ పరిధిలో కచ్చితమైన ఓటర్ల జాబితా తయారీకి చర్యలు తీసుకుంటున్నట్లు బందరు ఆర్డీవో కిషోర్ తెలిపారు. ఆయన కార్యాలయంలో సోమవారం ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పోలింగ్‌బూత్‌ల వారీగా సమీక్షించారు. ఏఏ పోలింగ్‌బూత్‌లు ఎక్కడ వరకు ఉండాలి, వాటి సరిహద్దులను రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి నిర్ణయించారు. పోలింగ్‌బూత్‌లలో ఏ డోర్ నెంబరు నుంచి ఏ డోర్ నెంబరు వరకు ఉండాలి, రెండు కిలోమీటర్ల పరిధిలో పోలింగ్‌బూత్ ఉండేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఓటర్లను జాబితాలో నుంచి తిరస్కరించటం, వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్లను తొలగించే కార్యక్రమంలో ఓటర్ల వారీగా రాజకీయ పార్టీల నేతలకు వివరించి తిరస్కరించే కార్యక్రమం చేశారు. ఈ ప్రక్రియ తర్వాత స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను తయారు చేస్తారని వారికి స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో ఓటర్లు ఇబ్బంది పడకుండా కుటుంబ సభ్యులు వారి పరిధిలోని పోలింగ్‌బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జి.చంద్రయ్య, తహసీల్దార్ శ్రీవిద్య, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### చవితి ఉత్సవాలకు రాటా ప్రతిష్ట

గుడివాడ టౌన్: వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డులో శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో సోమవారం రాటా ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ 18 నుంచి 26వ తేదీ వరకు స్వామివారి నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ప్రసాద్ తెలిపారు. నవరాత్రి మహోత్సవాల పనులు ప్రారంభ సూచికగా ఈ రాటా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ గంట చంద్రశేఖర్, పాలకవర్గ సభ్యులు బంటుమిల్లి సూర్యనారాయణ, ఎస్. నేలవేణి, తాత రజనీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

### డీవైఈవో కార్యాలయం ఏర్పాట్ల పరిశీలన



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: నగరంలోని నోబుల్ కళాశాల ఎదురుగా ఉన్న సోడీ, బీడీ, కిళ్లీ వర్తక సంఘం భవనంలో మచిలీపట్నం డీవైఈవో కార్యాలయం మంగళవారం ప్రారంభించనున్నారు. కార్యాలయంలో ఏర్పాట్లను సోమవారం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), డీవైఈవో యూవీ సుబ్బారావు తదితర అధికారులు పరిశీలించారు. ఈ భవనంలో మరిన్ని శాఖల కార్యాలయాల ఏర్పాటుకు అధికారులు ముందుకు రావాలని నాని సూచించారు. ఎమ్మెల్యే వెంట మండల ప్రత్యేకాధికారి జి.వి. సూర్యనారాయణ, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జి, వైఎస్సార్ సీపీ 13వ డివిజన్ ఇన్‌చార్జ్ గాజుల భగవాన్ తదితరులు ఉన్నారు.

### ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలి

గూడూరు: ఖరీఫ్ వరి నాట్లు పూర్తవడంతో ఈ పంట నమోదు, ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఏఏలు, వీఆర్వోలు, వీఆర్యేలతో ఈ క్రాప్‌బుకింగ్, ఈకేవైసీ నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పంట నమోదు ఆన్‌లైన్‌లో పొందుపరిస్తే రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా లబ్ధి పొందటానికి అవకాశం ఉంటుందన్నారు. దీనికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో వీఆర్వోలు, వీఏఏలు సమన్వయంతో ఈకేవైసీ, ఈ పంట నమోదు ప్రక్రియ వేగంగా చేయాలని కోరారు. సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జి.వి.శివప్రసాద్, వివిధ గ్రామాల వీఆర్వోలు, వీఏఏలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

# చివరి భూములకూ.. సాగునీరు పుష్కలం

- టీడీపీ నేతల విమర్శలపై మండిపడ్డ రైతులు
- వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పంటలు బాగా పండుతున్నాయని హర్షం




పాదాలవారిపాలెం వద్ద పొలాలను వైఎస్సార్ సీపీ నేతలకు చూపిస్తున్న రైతులు

కోడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చివరి భూములకూ పుష్కలంగా సాగునీరు అందుతోందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. మందపాకల పంచాయతీలోని పలు గ్రామాల్లో వరి పొలాలకు సాగునీరందక పంట పోతోందంటూ ఆదివారం టీడీపీ నేతలు చేసిన విమర్శలపై ఆ పంచాయతీ రైతులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ మండల నేతలను సోమవారం తమ పొలాలకు పిలిపించి, సాగునీరు పుష్కలంగా అందుతున్న తీరును చూపించారు. వర్షాభావ పరిస్థితులతో బ్యారేజీలో నీరు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇరిగేషన్ అధికారులు కోడూరు, నాగాయలంక మండలాలకు వంతులవారీగా సాగునీటిని మళ్లిస్తున్నారు. టీడీపీ నేతలు నాగాయలంక వంతు జరుగుతుండగా కోడూరు మండలంలో పర్యటించి కాలువల్లో నీరు లేదంటూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారని రైతులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తమకు అండగా నిలవడాన్ని టీడీపీ నేతలు ఓర్వలేక పోతున్నారని రైతులు మండిపడుతున్నారు.

**టీడీపీ నేతల తీరుపై ఆగ్రహం**


ప్రతి ఎకరానికి సాగునీటిని అందించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటే, వంతులేని సమయంలో కాలువల వద్దకు వచ్చి విమర్శలు చేయడం టీడీపీ నేతలకు పరిపాటిగా మారిందని పార్టీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీర వెంకటనారాయణరావు విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే రమేష్‌బాబులపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు గమనిస్తున్నారన్నారు. పార్టీ ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, ఎంపీటీసీ గంగాధరరావు, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ చంద్రరరావు, ఎస్సీసెల్ మండల కన్వీనర్ ప్రసాద్, బీసీసంఘ మండల అధ్యక్షుడు రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



### పంటలకు సాగు నీరు అందుతోంది

ప్రస్తుతం వర్షాభావంతో పరిస్థితులు అనుకూలించక పోయినా చివరి భూములకు కూడా అధికారులు నీటిని అందిస్తున్నారు. సకాలంలోనే వరినాట్లను కూడా పూర్తి చేసుకున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం ధర కూడా పెరిగింది. ప్రతి రైతు సంతోషంగా ఉన్నాడు.

– గోవిందరాజులు, రైతు, కోడూరు



### సకాలంలోనే పంట సాగుచేశాం

ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి కాలువలకు పుష్కలంగా నీటిని అందిస్తున్నారు. వరినారుమళ్లు, వరినాట్లను కూడా సకాలంలో వేసుకున్నాం. నీరు రావడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అవాస్తవం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి రైతు ఆనందంగా, సుభిక్షంగా ఉన్నాడు.

–బాలినేని వెంకటేశ్వరరావు, రైతు, పాదాలవారిపాలెం

# అందరికీ మేలు చేసేలా పాలన



శ్రీకాకుళంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

ఘంటసాల(అవనిగడ్డ): ఒక్క రూపాయి కూడా అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ ఫలాలను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ప్రత్యేక ముఖ్యమంత్రిగా గుర్తింపు తెచ్చుకున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సింహాద్రి గడప గడపకు తిరిగి వారికి అందుతున్న సంక్షేమ పథకాలను తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి భరోసా కల్పించేలా సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు వాటికి అడ్డుపడేలా చూస్తున్నారని చెప్పారు. పేదపిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్య, పక్కా గృహాలు వంటి వాటిని కోర్టుల్లో కేసులు వేయించి అడ్డుకునేలా చేశారన్నారు. మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరిస్తే ఇంత కంటే ఎక్కువ సంక్షేమ కార్యక్రమాలు అమలవుతాయని చెప్పారు. ఎవరెన్ని విమర్శలు చేసినా ఎదురుమొండి వారధి నిర్మాణానికి శంకుస్థాపన, కోడూరు రహదారి నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్రబాబు, సచివాలయ మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు ప్రోత్సాహం



ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహిస్తూ మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని జిల్లా కోర్టు సమీపంలో నిర్మించనున్న ఇండోర్ స్టేడియం పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జిల్లా కేంద్రం మచిలీపట్నంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరిన వెంటనే రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ. 2.49 కోట్లను మంజూరు చేశారని తెలిపారు. ఇండోర్ స్టేడియం నిర్మాణం డిసెంబరు 21వ తేదీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు నాటికి పూర్తవుతుందని పేర్ని కిట్టు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మాజీ డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ గూడవల్లి నాగరాజు, జిల్లా క్రీడాధికారి ఝాన్సీలక్ష్మి, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

**మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రాధాన్యం**

మచిలీపట్నంటౌన్: మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 22వ డివిజన్‌లో రూ. 21.47 లక్షలతో పక్కా డ్రెయిన్ల నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ 22వ డివిజన్ ముస్తాఖాన్‌పేట ప్రాంతంలో డ్రెయిన్ల నిర్మాణ పనులను 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టామన్నారు. కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు



అర్జీలపై మండల స్థాయి కమిటీ సమీక్ష

గూడూరు: 'జగనన్నకు చెబుదాం'లో వచ్చే అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ డి.సుబ్బారావు వెల్లడించారు. జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ఏర్పాటు చేసిన మండల స్థాయి అధికారుల బృంద సమావేశం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఇప్పటి వరకు వచ్చిన అర్జీలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. మండలంలో రెండు అర్జీలు మాత్రమే అపరిష్కృతంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఎస్సై వి.వెంకటేష్, ఎంఏఓ జి.వి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌ఎన్ గొల్లపాలెంలో పారిశుద్ధ్య పనులు



డ్రెయిన్లలో ఆయిల్‌బాల్స్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

కోనేరుసెంటర్: ఎస్ఎన్ గొల్లపాలెంలో సోమవారం పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామంలోని కచ్చా డ్రెయిన్లలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తి అధికంగా ఉంది. గ్రామస్తులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే పేర్ని నాని దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు మట్టా మోహనాచారయ్య పంచాయతీ సిబ్బందితో గ్రామంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. దోమల నిర్మూలనకు ఆయిల్‌బాల్స్‌తో పాటు మడ్డి ఆయిల్‌ను కలిపి గ్రామంలోని కాలువల్లో చల్లించారు. ఈ పనులు నాంచారయ్య, గ్రామ పెద్దలు దగ్గరుండి పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి రాంబాబు, సచివాలయం కన్వీనర్ బొల్లా వెంకటేశ్వరరావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వరుడి సన్నిధిలో అన్నదానం



అన్నదానం షెడ్డులో భోజనం చేస్తున్న వృద్ధులు, దివ్యాంగులు

నాగాయలంక: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో నిత్య అన్నదాన కమిటీ ఆధ్వర్యాన దాతల ఆర్థిక సహకారంతో సోమవారం నిరుపేద వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. విజయవాడకు చెందిన దాత గునుకుల పుల్లయ్య, వసంత దంపతులు, వారి కుమారుడు చంద్రశేఖర్, అనూష సహకరించారు. పుల్లయ్య దంపతుల పెళ్లిరోజు, శ్రావణ మాసం పురస్కరించుకుని కార్యక్రమం ఏర్పాటు చేశారు. నిర్వహణ సంధానకర్తలు రాచంశెట్టి పాపారావు, పొన్నపల్లి చిన్నా పర్యవేక్షణలో బండ్రెడ్డి బోసు, పొన్నపల్లి లంకమ్మ, సబ్బినేని రాణి, మత్తి శేషుబాబు తదితరులు సేవలందించారు.

### రైతుల సంక్షేమమే లక్ష్యంగా సేవలు

ఉయ్యూరు: రైతుల సంక్షేమమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నామని యూనియన్ బ్యాంక్ మచిలీపట్నం రీజనల్ హెడ్ కె.వెంకటరావు అన్నారు. పట్టణంలోని యూనియన్ బ్యాంక్‌లో కస్టమర్స్ ఔట్‌రీచ్ కార్యక్రమం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరావు మాట్లాడుతూ.. 70 ఏళ్ల క్రితం రైతుల ప్రయోజనార్థం యూనియన్ బ్యాంకు ప్రారంభమయిందని పేర్కొన్నారు. ఏటా రూ.200 కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నామని వివరించారు. సులభ వడ్డీతో బంగారు ఆభరణాలపై రుణాలు మంజూరు చేసి గృహనిర్మాణాలకు, విద్యా ప్రగతికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణసదుపాయం విస్తృతం చేశామన్నారు. బ్రాంచ్ మేనేజర్ పి.జయరాం, మచిలీపట్నం హెడ్ చీఫ్ మేనేజర్ పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### కోడిపందేలపై శిబిరంపై దాడి.. ఆరుగురి అరెస్ట్

పెడన: బల్లిపర్రు గ్రామ శివారులో కోడిపందేల శిబిరంపై పెడన పోలీసులు సోమవారం మధ్యాహ్నం దాడి చేశారు. ఘటనలో ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2,700 నగదు, ఒక కోడిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రవిచంద్రకుమార్ తెలిపారు.